నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 3 అక్టోబర్ 2024 | RANGAREDDY



# దూసుకొస్తున్న జేసీబీలు

శిథిలాల తొలగింపునకు సర్కారు రెడీ.. కాలనీల్లో భయం.. భయం

## రెడ్ మార్క్ నిరాకరించిన ఇండ్లపై అధికారుల కన్ను

- ప్రజలు అడ్డుకోకుండా.. రహస్యదారుల అన్వేషణ
- పరీవాహక ప్రాంతంలో టెన్షన్.. టెన్షన్
- మిగిలిన నిర్మాణాలు కూల్చే ప్రణాళికలు
- అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్న నిర్వాసితులు
- మళ్లీ ఉద్రిక్తత తలెత్తే అవకాశం

*మూసీ రణరంగాన్ని తలపిస్తున్నది. ఎప్పుడు ఏమవుతుందోనన్న టెన్షన్ నెలకొన్నది. ఏండ్ల తరబడి అక్కడ బతుకుతున్న వారి ఇండ్లను కూల్చేసి రేవంత్ సర్కార్ దమనకాండకు తెర తీసింది. ఇప్పటికే 150 ఇండ్లు నేలమట్టమయ్యాయి. మరో 940 గృహాలపై రెడ్ మార్క్ వేలాడుతున్నది. ఎటు నుంచి జేసీబీలు, బుల్డోజర్లు వస్తాయోనని నిర్వాసితులు బిక్కుబిక్కుమంటున్నారు. మరోవైపు అధికారులు కూల్చేసిన గృహాల శిథిలాలను తరలించాల్సి ఉన్నది. అందుకోసం జేసీబీలను రంగంలోకి దించేందుకు సిద్ధమయ్యారు. నేడు అవి హిమాయత్‌నగర్, సైదాబాద్ మూసీ పరీవాహక ప్రాంతాల్లోకి దూసుకొచ్చేందుకు సిద్ధమయ్యాయి. అయితే హిమాయత్‌నగర్, సైదాబాద్‌లో కూల్చేసిన నిర్మాణాల వరకు జేసీబీలు వెళ్లే రోడ్లు లేవు. ఇరుకు రహదారులతో ఆ*



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందు గోడు వెళ్లబోసుకుంటున్న మూసీ బాధితురాలు

*ప్రాంతాలు ఉన్నాయి. రెడ్ మార్క్ నిరాకరించిన ఇండ్లను సైతం కూలగొట్టినా.. జేసీబీలు అక్కడి వరకు వెళ్లలేని పరిస్థితి. ఒకవేళ ఎంట్రీ ఇచ్చినా.. అడ్డుకునేందుకు నిర్వాసితులు సిద్ధమవుతుండటంతో పరీవాహక ప్రాంతాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితి తలెత్తే అవకాశమున్నది. అయితే అలాంటి పరిస్థితి ఎదురైతే ఏం చేయాలన్న అంశంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రజల కంట పడకుండా జేసీబీలను అక్కడికి తరలించేందుకు రహస్యదారులను అన్వేషించినట్లు సమాచారం.*

-సిటీబ్యూరో

### రహస్యదారుల అన్వేషణ

హిమాయత్‌నగర్, సైదాబాద్‌లో కూల్చేసిన నిర్మాణాల శిథిలాలు తరలించేందుకు అధికారులు రహస్యదారులను పరిశీలిస్తున్నారు. జేసీబీలను ప్రజలు అడ్డుకోకుండా త్వరగా శిథిల ప్రాంతాలకు వెళ్లేలా ప్రణాళికలు వేస్తున్నారు. అందుకోసం మూడు మార్గాలను అధికారులు ఎంచుకున్నట్టు తెలిసింది. అందులో భాగంగా ఎంజీ బస్టాండ్ నుంచి 1/2 కిలోమీటర్ మూసీ మార్గాన్ని పరిశీలించినట్టు తెలిసింది. మరో మార్గం పురానాపూల్ నుంచి ఒకటిన్నర కిలోమీటర్ దూరంతో మూసీ వెంట రూట్‌ను కూడా పరిశీలించినట్లు సమాచారం. మూసారంబాగ్ నుంచి అంబర్‌పేట బ్రిడ్జి మీదుగా సదరు లొకేషన్‌కు చేరుకునే మార్గాన్ని కూడా చర్చించుకున్నట్టు తెలిసింది. ఈ మార్గాలపై రెవెన్యూ అధికారులు, పోలీసులు చర్చలు జరిపినట్టు సమాచారం.

### జేసీబీ ప్రవేశిస్తే..

మూసీ పరీవాహక ప్రాంతంలో కూల్చివేతలు 50 మంది లేబర్లతో జరిగాయి. 150 నిర్మాణాలు భూస్థాపితమయ్యాయి. ఆ శిథిలాలను తరలించాలనే నెపంతో జేసీబీలను అధిక సంఖ్యలో అక్కడికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక్కసారి అవి అక్కడికి వెళితే శిథిలాల తొలగింపుతో పాటు రెడ్ మార్క్ చేసిన ఇతర నిర్మాణాలను సైతం కూల్చేయనున్నట్టు ఓ అధికారి తెలిపారు. అయితే ఇది అక్కడి పరిస్థితులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటికే కొందరిని ఒప్పించి డబుల్ బెడ్రూం అందించడానికి నిర్ణయించామని.. వారి అంగీకారంతో మిగిలిన నిర్మాణాలు కూల్చేస్తామని పేర్కొన్నారు. మరోవైపు తమ ఇండ్లను బలవంతంగా, బెదిరిస్తూ కూల్చేస్తున్నారని నిర్వాసితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పోలీసుల బెదిరింపులతో ఖాళీ చేయాల్సిన దుస్థితి వస్తున్నదని రమ్య, ఫాతిమా అనే మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

### సీఎం రేవంత్‌కు మనసు లేదు



మాకు ఇక్కడి నుంచి వెళ్లాలని లేదు. మా ఇల్లును కూల్చేశారు. మమ్మల్ని బెదిరించి కూల్చారు. మా బతుకును నాశనం చేశారు. రేవంత్ సర్కార్‌కు మా కన్నీటి గోస తగులుతుంది. మేం అనుభవిస్తున్న కష్టానికి వంద రెట్లు అధికంగా గోసపడాల్సిన పరిస్థితి వస్తుంది. ఇలాంటి మనసులేని సీఎం ను మేం ఏనాడూ చూడలేదు.


-ఫాతిమా, మూసానగర్.

### మీరేం బాగుపడుతారు..



మూసీలో ఏండ్ల తరబడి ఉంటున్నాం. మా ఇండ్లను కూల్చితే మీకేం వస్తుంది. మా బతుకులు నాశనం చేసి కట్టే భవంతులు, నిర్మాణాలు మీకు మేలు చేయవు. మేము ఇష్టపూర్వకంగా వెళుతున్నామని అధికారులు చెబుతున్నారు. అది అబద్ధం. మమ్మల్ని బెదిరించి పంపడానికి చూస్తున్నారు. నిర్మాణాలు కూల్చడానికి ఏ మిషన్లు వచ్చినా.. అడ్డుకుంటాం. మా ఇండ్లు కూల్చి మీరేం బాగుపడుతారు.

-చాంద్‌బీ, శంకర్‌నగర్.



- అప్పులతోనే సాగును చేపట్టి ఆర్థిక ఇబ్బందుల్లో జిల్లా రైతాంగం
- అన్నదాతలపై పెట్టుబడి భారం రూ.165.84 కోట్లు
- ప్రతికూల పరిస్థితుల్లో ఈసారి 16 వేల ఎకరాలు తగ్గిన సాగు విస్తీర్ణం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రంగారెడ్డి జిల్లా రైతాంగం
- కేసీఆర్ హయాంలో 11 విడుతల్లో రూ.3,337 కోట్ల మేర అందిన పెట్టుబడి సాయం



# రైతు భరోసా.. జాడేది?

## వానకాలం ముగిసినా.. అందని పెట్టుబడి సాయం

**అదిగో.. ఇదిగో రైతు భరోసా అంటూ రైతాంగాన్ని ఊరించిన కాంగ్రెస్ ప్రభుత్వం చివరకు చెయ్యిచ్చింది. 11 విడతలుగా నిర్విఘ్నంగా కేసీఆర్ సర్కారు పంటల సాగుకు పెట్టుబడి సాయం అందించి రైతుల్లో భరోసా నింపింది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క యాసంగిలోనే అంతంతగా సాయం అందించి చతికిలపడింది. వానకాలం ముగిసినప్పటికీ సాయం ఊసే లేకపోవడంతో రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఈసారి ప్రతికూల పరిస్థితుల్లో అరక సాగక.. సాగు విస్తీర్ణం సైతం గణనీయంగా తగ్గింది. ప్రైవేటుగా అప్పులు తెచ్చి సాగుకు ఉపక్రమించడంతో రంగారెడ్డి జిల్లా రైతులపై దాదాపు రూ.165.84 కోట్ల భారం పడి ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.**

- రంగారెడ్డి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ)

### ఇబ్బందులు పడుతున్నాం



రైతు భరోసాతో తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావించాం. కాని సీజన్ అయిపోవస్తున్నా ఇప్పటి వరకు నిధులను కేటాయించకపోవడంతో ఆందోళనకరంగా ఉన్నది. రైతు భరోసాను నమ్మి అప్పులు తీసుకువచ్చి పంటలు వేశాం. గత ప్రభుత్వం పంట ప్రారంభమయ్యేలోనే రైతు బంధు వేసేది. లాగోడికి ఇబ్బంది ఉండేది కాదు.

– గుండుమల్ల నర్సింహులు, రైతు, తిర్మలాపూర్, కులకచర్ల మండలం

### ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి



అన్నదాతలకు రైతు భరోసా పేరుతో పంటలకు పెట్టుబడి సాయాన్ని అందిస్తామని ఎన్నికల సమయంలో చెప్పి దాని జోలే ఎత్తడంలేదు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. సాయం అందిస్తామని చెప్పి ఓట్లను దండుకొని మాట మరువడం విడ్డూరం. ఇప్పటికైనా సర్కారు రైతు భరోసాను ఇవ్వాలి.

– కుర్వ భిక్షపతి, నాగులపల్లి, పెద్దేముల్ మండలం

### అప్పులు చేసి ఎరువులు, విత్తనాలు తీసుకున్నా



రైతు బంధు రాక అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు తీసుకొచ్చి పంటలు సాగు చేశా. గత కేసీఆర్ ప్రభుత్వంలో సాగు సమయానికి పెట్టుబడి డబ్బులు వచ్చేవి.

– రాంచంద్రయ్య, రావులపల్లి, మర్పల్లి మండలం

### సాయం రాక అప్పులు చేశాం



ప్రతీసారి దుక్కులు దున్ని, విత్తనాలు విత్తేనాటికి పెట్టుబడి సాయం అందేది. ఈ ఏడాది పంట సాయం అందక అప్పులు చేశాం. ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువులు కొన్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే కొంత అప్పు తీరుతుంది.

– గాలి రాజు, తొరుమామిడి, బంట్వారం మండలం

### సాగు తగ్గింది.. అప్పులు పెరిగాయి..

గత యాసంగిలో నెలకొన్న అనావృష్టి, కరెంటు కోతలతో నష్టపోయిన రైతులు వానకాలంలోనైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావించారు. అయితే వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే అందాల్సిన రైతు భరోసా సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో జిల్లా రైతాంగం పంటల సాగు విషయంలో డైలమాలో పడింది. కొందరు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలను సాగు చేశారు. మరికొందరు కొంతమేర పొలాలను బీళ్లుగా ఉంచి పంటల సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకున్నారు. గత రెండూ, మూడు నెలలుగా ఊరిస్తూ వచ్చిన సర్కారు వానకాలం సీజన్ ముగిసేనాటికి కూడా అందించలేకపోయింది. మరికొద్ది రోజుల్లోనే పత్తి వంటి పంటలు సైతం చేతికందనున్నాయి. గత వానకాలంలో 3,47,989 ఎకరాల్లో వివిధ పంటలను జిల్లా రైతులు సాగు చేయగా.. ప్రస్తుతం 3,31,692 ఎకరాల్లోనే సాగు చేశారు. ఈ లెక్కన ఈసారి 16వేల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం తగ్గింది. పెట్టుబడి సాయం అందక.. ఈసారి పంటలను సాగు చేసిన జిల్లా రైతాంగం దాదాపు రూ.165.84 కోట్ల మేర ఆర్థిక భారాన్ని మోయాల్సి వచ్చింది. అదే విధంగా వికారాబాద్ జిల్లాలో 4.08 లక్షల ఎకరాల్లో ఈ వానకాలం పంటలను సాగు చేశారు. గత వానకాలం సాగు కంటే ఈసారి సాగు విస్తీర్ణం తగ్గిందని వికారాబాద్ జిల్లాయంత్రాంగం పేర్కొన్నది. కాంగ్రెస్ సర్కారు అన్నదాతలపై చూపుతున్న నిర్లక్ష్యంతో జిల్లా రైతాంగం మండిపడుతున్నది.

### కేసీఆర్ హయాంలో రూ.3,337 కోట్ల సాయం..

రైతులు పంట పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేసీఆర్ ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్లకు ముందుగానే రైతు బంధు సాయాన్ని అందిస్తూ వచ్చింది. అప్పులు చేసే పరిస్థితులకు చరమగీతం పాడిన రైతు బంధు పథకానికి ప్రతి అన్నదాత కుటుంబం ఫిదా అయింది. 2018 వానకాలం సాగు నుంచి ఏటా రూ.8వేల సాయం అందించగా.. 2019 వానకాలం సీజన్ నుంచి సాయాన్ని రూ.10వేలకు పెంచారు. కరోనా వంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ పెట్టుబడి సాయాన్ని ఆపలేదు. రైతన్నలకు ఆత్మబంధువుగా నిలిచిన రైతు బంధు పథకంలో రంగారెడ్డి జిల్లాలోని రైతాంగానికి 11 విడతలుగా గత యేడాది వానకాలం సీజన్ వరకు రూ.3,337 కోట్లను నిరాటంకంగా అందించింది. ప్రతి సీజన్‌కు ముందుగానే కేసీఆర్ హయాంలో రైతు బంధు సాయం అందగా.. కాంగ్రెస్ హయాంలో సీజన్ ముగిసేనాటికి కూడా నయా పైసా రైతుల ఖాతాల్లో జమకాని దుస్థితి నెలకొన్నది. తొలకరి జల్లులు కురిసింది మొదలు.. దుక్కులు దున్నడం.. ఎరువులు.. విత్తనాలు.. కూలీల కోసం రైతులకు పెట్టుబడి ఖర్చులు ప్రతి సీజన్‌కు తడిసి మోపెడవుతుండగా.. ఇందుకోసం అయినకాడికి అప్పు చేసి సాగు బాట పట్టాల్సి వస్తున్నది.

### అప్పులు చేసే పరిస్థితి దాపురించింది..



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండుసార్లు రైతు బంధు వచ్చేది. కాంగ్రెస్ సర్కారు వచ్చినంక అన్ని ఇబ్బందులే. అప్పులు చేసే పరిస్థితి దాపురించింది. యాసంగి వచ్చినప్పటికీ వర్షాకాలం పంటలసాగు పెట్టుబడి సాయం నేటికీ అందించకపోవటం సిగ్గుచేటు.

– మొగిలి వెంకటేశ్, ఇబ్రహీంపట్నంరూరల్

### సీజన్ ముగిసినా డబ్బులు రాలే..



వానకాలం సీజన్ ముగిసినా రైతు భరోసా సాయం అందలేదు. బీఆర్ఎస్ పాలనలో సాగు కాలం ప్రారంభమవ్వగానే పెట్టుబడి సాయాన్ని ఖాతాల్లో జమ చేసేది. ప్రస్తుత ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని మరిచిపోయినట్టుంది. కేసీఆర్ పాలనలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడలేదు.

– రాములుయాదవ్, కడ్తాల్ మండలం

### తక్కువ సాగు చేయాల్సి వస్తున్నది..



సీజన్ ముగిసినా రైతు భరోసా ఇవ్వడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో సాయం అందేది. ఇప్పుడు సాయం అందక అప్పులు చేసే పరిస్థితి వచ్చింది. దీంతో తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నాం. ప్రజా ప్రభుత్వమని చెప్పే కాంగ్రెస్ సర్కారు ఎందుకు సకాలంలో సాయం చేయడంలేదో చెప్పాలి.

– ఇమ్రాన్, సింగప్పగూడ, చేవెళ్ల మండలం

### రూ.40 వేలు అప్పు చేశాను..



వానకాలం పంటల సాగు కోసం రూ.40 వేలు అప్పు చేశాను. వరిపంటతో పాటు కూరగాయల పంట సాగు చేశాను. గతంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తే ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసేవాళ్లం. ప్రస్తుతం రైతు భరోసా వేయకపోవడంతో అప్పులు చేసి ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.

– పి.కుమార్‌యాదవ్, కుమ్మరిగూడ, షాబాద్ మండలం



ఆమనగల్లులో..



# కనుల నిండుగా.. పూల పండుగ..

*ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బుధవారం బతుకమ్మ పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మకు పూజ చేసి సాయంత్రం పల్లె, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, గల్లీల వద్ద ఉంచి ఆడిపాడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. కలవారి కోడలు ఉయ్యాలో.. కలికి కామాక్షి ఉయ్యాలో.. అంటూ ఉత్సాహంగా వేడుకను నిర్వహించుకున్నారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.*

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ